నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 నల్లగొండ, సోమవారం 3 ఫిబ్రవరి 2025 NALGONDA

## ఢిల్లీ సాహిత్య కార్యక్రమాలకు జిల్లా రచయితలు



తుల శ్రీనివాస్



సాగర్ల సత్తయ్య

రామగిరి, ఫిబ్రవరి 2: ఢిల్లీకి చెందిన సాహిత్య సంస్థ ఆది లీలా ఫౌండేషన్, తెలుగు సాహితీ కళా పీఠం, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఈ నెల 8, 9 తేదీల్లో ఢిల్లీలోని తెలంగాణ భవనంలో నిర్వహించే సాహిత్య కార్యక్రమాలకు నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు కవులకు ఆదివారం ఆహ్వానం అందింది. నకిరేకల్‌కు చెందిన కవి తుల శ్రీనివాస్, అష్టావధానంలో పాల్గొనడానికి చిట్యాల మండలం వట్టిమర్తికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి, రచయిత సాగర్ల సత్తయ్యకు ఆహ్వానం అందినట్లు వారు తెలిపారు. జాతీయస్థాయి సాహిత్య కార్యక్రమానికి వెళ్తున్న శ్రీనివాస్, సత్తయ్యను జిల్లా కవులు, రచయితలు, సాహిత్య సంస్థల నిర్వాహకులు అభినందించారు.





నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు

# మసకబారుతున్న ప్రభుత్వ వైద్యం

- అందుబాటులో లేని యాంటీ బయాటిక్, కాల్షియం, గ్యాస్ గోలీలు
- సరిపడా లేని సెలైన్ బాటిళ్లు, యూరిన్ బ్యాగులు
- పడిపోతున్న ప్రసవాలు, ఓపీ సేవలు
- వైద్య చికిత్సలు, మౌలిక సదుపాయాలు అంతంత మాత్రమే..
- వైద్య పరికరాలు, యంత్రాల మరమ్మతులు పట్టించుకోని సర్కారు
- ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కోల్పోతున్న జనం

## సర్కారు దవాఖానల్లో మందుల కొరత

**కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రభుత్వ వైద్యం మసకబారుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు అత్యుత్తమ వైద్యం అందించేందుకు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసింది. వాటికి అనుసంధానంగా జనరల్ ఆసుపత్రుల బలోపేతం, పట్టణ, పల్లె దవాఖానలు విరివిగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించింది. వైద్య పరీక్షలకు అన్ని రోగాలకు మందులు అందించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కనీసం మందులు కూడా అందుబాటులో లేవు. ఏడాది క్రితం వరకు ఉమ్మడి నల్లగొండలోని సర్కారు దవాఖానలకు పేషెంట్లు పోటెత్తగా ప్రస్తుతం అరకొరగా వస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రసవాలు, ఓపీ పడిపోతున్నాయి. అత్యధికంగా అవసరం ఉండే యాంటీబయాటిక్స్, కాల్షియం, గ్యాస్ తదితర మందులు కూడా నెలల తరబడి అందుబాటులో లేవు. చిన్న రోగానికైనా ఎక్కించే సెలైన్ బాటిల్స్ కొరత ఉన్నది. యూరిన్ బ్యాగులు, పైపులు లేవు. బ్లడ్ గ్రూపింగ్ కిట్స్ కూడా మూడు నెలలుగా అందుబాటులో లేవు. చివరకు కాటన్ కూడా రోగులను బయటకు పంపిస్తున్నారు.**

– సూర్యాపేట, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ)

### తిరోగమనంలో వైద్య సేవలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోగులకు ఉచిత వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పాలవుతున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనరల్ దవాఖానతోపాటు ఏరియా ఆసుపత్రుల్లో వైద్య సేవలు దాదాపు పడిపోయాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న చివరి ఏడాది 2023లో జిల్లాలో 5,167 ప్రసవాలు కాగా, 2024లో 4,243 మాత్రమే జరిగాయంటే ప్రజలు ప్రభుత్వ దవాఖానలపై ఏ రీతిన నమ్మకం కోల్పోయారో అర్థమవుతుంది. ప్రభుత్వ దవాఖానల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం, సరిపడా మందులు లేకపోవడం, జనరల్ ఆసుపత్రిలో అత్యధికంగా ఫైనల్ ఇయర్ ఎంబీబీఎస్ విద్యార్థులే చికిత్సలు అందిస్తుండడం కారణంగా తెలుస్తున్నది.





సూర్యాపేట జనరల్ ఆసుపత్రి ముందు ప్రైవేట్ మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేస్తున్న ఓ రోగి బంధువు

### కొన్ని మందులు బయటికే..

ఇక చిన్న, పెద్ద వ్యాధులకు తప్పనిసరి కావాల్సిన యాంటీ బయాటిక్, గ్యాస్ ట్రబుల్ గోలీలు, ఎమర్జెన్సీ డ్రగ్స్ చాలా వరకు ప్రభుత్వ దవాఖానల్లో లేవు. సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి వచ్చిన షేక్ అబ్దుల్లా అనే రోగి కడుపు నొప్పితో వస్తే ట్రామాడావ్, పాన్ టాప్ లాంటి మందులను బయట కొనుక్కోమనడంతో ఆసుపత్రి బయట తీసుకున్నాడు. సిప్రోఫ్లాక్సిన్, ఎమైకైబిల్‌తో పాటు జలుబు, దగ్గుకు లియోసిట్రజిన్, కడుపు నొప్పి, గ్యాస్‌లకు పాన్ టాప్, ట్రమాడాన్ లాంటి ఇంజక్షన్లు కూడా లేవు. మట్టయ్య అనే రోగికి సర్జరీ చేసేందుకు సిరమ్ ఎలక్ట్రోకిట్‌ను బయట కొనుగోలు చేశారు. బ్లడ్ గ్రూపింగ్ కిట్లు, శానిటైజర్లు, స్పిరిట్, మాస్కులు కూడా అందుబాటులో లేవని ఏకంగా ఓ డాక్టర్ చెప్పడం గమనార్హం. గతంలో వార్డుకో ఈసీజీ మిషన్ ఉంటే నేడు ఒకే ఒక్కటే ఉన్నది.

గతంలో కొనుగోలు చేసిన మిషన్లను కనీసం మరమ్మతులు చేయించలేని దుస్థితి సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో ఉంది. ఉన్న ఒక్క ఈసీజీ వద్ద కూడా కావాల్సిన జెల్ ట్యూబ్ బయట కొనుగోలు చేయిస్తున్నారు. దీనికి తోడు బీఆర్ఎస్ హయాంలో డయాగ్నస్టిక్ హబ్ ఏర్పాటు చేసి అన్ని రకాల పరీక్షలు చేయగా ప్రస్తుతం కొన్ని పరీక్షలు మాత్రమే చేస్తుండడంతో జనం ప్రభుత్వ వైద్యంపై ఆసక్తి చూపడం లేదు. మళ్లీ పూర్వ విధానం ప్రకారం ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది.



### చెవుల వినికిడి మందులు లేవు

నాకు చెవులు వినిపించవు. వాటికోసం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు వచ్చిన. ఓపీలో పేరు రాపించుకుని డాక్టర్‌ను సంప్రదించగా చెరువులు వినిపించడానికి మందులు వాడాలని చెప్పాడు. చెవిలో వేసుకునే మందులు చిట్టిపై రాసిచ్చాడు. ఆ చిట్టిని పట్టుకుని మందులు ఇచ్చే కౌంటర్ వద్దకు వెళ్లగా అక్కడ చెవిలో వేసుకునే మందు అందుబాటులో లేదన్నారు. బయట మెడికల్ షాపులో కొనుక్కోవాలని చెప్పారు. డబ్బులు లేని పరిస్థితి ఉందని ఇక్కడికొస్తే మందులు లేకపోవడంతో ఏం చేయాలో తోయడం లేదు.

-ఐలయ్య, బండసోమారం, భువనగిరి మండలం

### ఆయింట్‌మెంట్ బయట కొనుక్కోమన్నరు



నా కాలుకు దెబ్బ తాకడంతో పాయిజన్ అయ్యింది. పోయిన అక్టోబర్‌లో హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో చికిత్స చేయించుకున్నా. అక్కడ చాలా ఖర్చయ్యింది. అప్పటి నుంచి వారంలో రెండు సార్లు భువనగిరి ఏరియా దవాఖానలో డ్రెస్సింగ్ చేయించుకుంటున్నా. అందుకు సంబంధించిన ఆయింట్‌మెంట్ దవాఖానలో లేదని చెప్పింన్రు. బయట కొనుక్కోమన్నరు. దానికి ఎంత డబ్బులవుతాయో తెల్వదు. అన్ని మందులు ఇక్కడ అందుబాటులో ఉంచితే మాలాంటి పేదలకు ఎంతో సయంగా ఉంటుంది.

-శ్రీనివాసాచారి, జైనపల్లి, బీబీనగర్ మండలం

# నేటి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లు

- వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజక వర్గం పరిధిలో ఎన్నికలు
- నల్లగొండలోనే నామినేషన్ల స్వీకరణ
- ఈ నెల 10వరకు నామినేషన్ల స్వీకరణ.. 27న ఎన్నికలు
- 12 జిల్లాల్లో ఓటు వినియోగించుకోనున్న 24,905 మంది ఉపాధ్యాయులు

నల్లగొండ, ఫిబ్రవరి 2 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం నల్లగొండలోని కలెక్టరేట్‌లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. వచ్చే నెల 29తో ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం పూర్తి కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం గత నెల 29న షెడ్యూల్ విడుదల చేయగా నేడు నోటిఫికేషన్ జారీ చేయనుంది. నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తూ ఈ నెల 10 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలోని అభ్యర్థులు నల్లగొండలోనే నామినేషన్లు వేయనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు తీసుకోనున్నారు. ఈ నెల 11న స్క్రూట్నీ, 13న ఉపసంహరణ అనంతరం 27న పోలింగ్ నిర్వహించి మార్చి 3న ఫలితాలను లెక్కించనున్నారు. దీనికి సంబంధించి ఎన్నికల యంత్రాంగం జిల్లాలో 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, ఆయా పోలింగ్ కేంద్రాల్లో 24,905 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**ఫలితాల లెక్కింపు కూడా నల్లగొండలోనే..**

పోలింగ్ అనంతరం కౌంటింగ్ కూడా నల్లగొండలోనే నిర్వహించనున్నారు. కౌంటింగ్‌కు సంబంధించి ఆర్జాలబావిలోని గిడ్డంగుల సంస్థ గోదాములో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల్లో మొత్తం 12 జిల్లాలు ఉండగా నల్లగొండ కలెక్టర్ ఆర్వోగా, ఇతర జిల్లాల కలెక్టర్లు ఏఆర్వోగా వ్యవహరించనున్నారు. ఉమ్మడి మూడు జిల్లాల్లో 24,905 మంది ఉపాధ్యాయ ఓటర్లకుగానూ నల్లగొండలో 4,483, సూర్యాపేటలో 2,637, యాదాద్రిలో 9,21, సిద్దిపేటలో 163, జనగామలో 921, హన్మకొండలో 5,098, వరంగల్‌లో 2,225, మహబూబాబాద్‌లో 1,618, భూపాలపల్లిలో 323, ములుగులో 612, భద్రాద్రిలో 1,949, ఖమ్మంలో 3,955 మంది ఉన్నారు.

# తుంగతుర్తి కాంగ్రెస్‌లో వర్గపోరు

**ఎమ్మెల్యే సామేల్‌కు వ్యతిరేకంగా నేడు మోత్కూరులో అసమ్మతివాదుల సమావేశం**

మోత్కూరు, ఫిబ్రవరి2 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు సొంత పార్టీలోనే కుంపటి మొదలైంది. కాంగ్రెస్‌లో సీనియర్లమైన తమను కాదని ఇటీవల పార్టీలో చేరిన వారికి ప్రయార్టీ ఇస్తున్నారని ఎమ్మెల్యే సామేల్‌కు వ్యతిరేకంగా సోమవారం మోత్కూరులో అసమ్మతివాదులు సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి సిద్ధమయ్యారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడు పైళ్ల సోమిరెడ్డికి ఇటీవల డీసీసీ ఉపాధ్యక్ష పదవిని కట్టబెడుతూ డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి నియమాకం పత్రం అందజేశారు. తనకు తెలియకుండా సోమిరెడ్డికి ఎలా డీసీసీ పదవి ఇస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఎమ్మెల్యే సామేల్ వాదనకు దిగారు. అదే విధంగా గత కొంత కాలంగా ఎమ్మెల్యే సామేల్ ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో తమను కలుపుకొని పోవడం లేదంటూ సీనియర్లు మంత్రి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కలిసి వాపోయారు. సామేల్‌కు పలుమార్లు జోక్యం చేసుకొని సీనియర్లను కలుపుకొని వెళ్లాలని వారు సూచించారు.తన నియోజకవర్గంలో వారి పెత్తనం ఏంటని మంత్రి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డిని సామేల్ వ్యతిరేకిస్తూ వారి అనుచర వర్గానికి తన పర్యటన సమాచారం ఇవ్వకపోగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లోనూ ప్రాతినిధ్యం కల్పించడం లేదు. దీనిపై మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మీదేవికాల్వ మాజీ సర్పంచ్ నారగోని అంజయ్యగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, మోత్కూరు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, ఆ పార్టీ అడ్డగూడూరు మండల నాయకుడు రాచకొండ రమేశ్ నేతృత్వంలో నియోజకవర్గంలోని 9 మండలాలకు చెందిన మండల, గ్రామ శాఖల అసమ్మతి వాదులను కూడగట్టారు. ఈ మేరకు మోత్కూరులోని ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సమావేశానికి ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతమ్‌తోపాటు నియోజక వర్గానికి చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిసింది. మోత్కూరులో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే సామేల్‌కు ఆహ్వానం లేకపోగా, తమకు కూడా సమాచారం లేదని ఎమ్మెల్యే సామేల్ ముఖ్య అనుచరులు చెబుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘం నాయకులు

## రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై సర్కారు నిర్లక్ష్యం

- ఏడాదిగా ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం
- రిటైర్డ్ ఉపాధ్యాయ, అధ్యాపకుల ఆవేదన

రామగిరి, ఫిబ్రవరి 2 : ప్రభుత్వ విద్యాలయాల్లో సుదీర్ఘకాలం పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, అధ్యాపకుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, రిటైర్మెంట్ అయ్యి ఏడాది గడిచినా బెనిఫిట్స్ ఇవ్వడం లేదని ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు సిలిగిరి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కట్టబత్తుల గణేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండలోని పీఆర్‌టీయూ భవనంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రిటైర్డ్ అయిన తర్వాత ఉద్యోగికి వచ్చే బెనిఫిట్స్‌ను తక్షణమే అందించి పంపించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని అన్నారు. ఏడాదిగా బెనిఫిట్స్ రాకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని తెలిపారు. ఈ విషయంపై సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా వారిలో చలనం లేదని బాధపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బెనిఫిట్స్ వెంటనే వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు కె.వెంకట్‌రెడ్డి, మహమ్మద్ ముస్తఫా, అలీ ఖాన్, ఇంద్రసేనారెడ్డి, బి.ప్రతాప్‌రెడ్డి, వందనం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో నల్ల జెండాతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

## కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

రామగిరి, ఫిబ్రవరి 2 : కేంద్రంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం పలుచోట్ల నిరసనలు చేపట్టారు. నల్ల జెండాలు పట్టుకొని, కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నల్లగొండ సుభాశ్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం, నాయకులు దండెంపల్లి సత్తయ్య, ఎండీ సలీం, పుచ్చకాల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

# సాగు నీటి గోస

## రాజాపేట మండలంలో కరువుఛాయలు

**వట్టిపోయిన చెరువులు..**

**అడుగంటిన భూగర్భ జలాలు**

- వెయ్యి ఫీట్లు బోర్లు వేసినా చుక్కరాని పరిస్థితి
- కాళేశ్వరం 15వ ప్యాకేజీ కాల్వలను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- కాల్వలు పూర్తయితే తీరనున్న నీటి సమస్య
- అప్పులు చేసి పంటలు సాగు చేసినా దక్కని పరిస్థితి
- నీళ్లు లేక ఎండిన పంటలను పశువులకు మేతగా వదిలివేత
- సాగు నీళ్లివ్వాలని పది రోజులుగా నిరసనలు చేపడుతున్న రైతులు

‘గోదారి.. గోదారి.. పారేటి గోదారి.. చుట్టూ నీళ్లు ఉన్నా చుక్క నీరు దొరకని ఏడారి ఈ భూమి.. తలాపున పారుతుంది గోదారి.. మన చేను.. మన చెలక ఎడారి’ అనే పాటలు మళ్లీ ఇప్పుడు పాడుకునే రోజులు వచ్చాయి. ఇది అక్షరాల నిజం. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా రాజాపేట మండలానికి సాగు జలాలు అందించాలని స్థానిక పాలకులు ప్రయత్నం చేస్తుండకపోవడంతో కరువుతో రైతన్నలు అల్లాడుతున్నారు. కాల్వలు ఉన్నా నీళ్లు రాక, చెరువులు వట్టిపోయి, బోర్లు ఎండిపోయి పంట పొలాలు ఎండిపోతున్నాయి. మళ్లీ వలసలు మొదలై రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాజాపేట మండలానికి కాళేశ్వరం 15 ప్యాకేజీ ద్వారా గొలుసుకట్టు చెరువులు నింపి సాగు జలాలు అందించాలని రైతు జేఏసీ ఆధ్వర్యంలో గత పదిరోజుల నుంచి నిరసనలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి మాత్రం స్పందన లేదు. గోదావరి జలాలు అందిస్తే ఈ ప్రాంతంలో సాగునీటి సమస్య తీరే అవకాశం ఉన్నది.

– రాజాపేట, ఫిబ్రవరి 2



నీళ్లు లేక పాముకుంటలో ఎండిన వరిపంట



కాళేశ్వరం జలాలు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తవ్విన కాల్వ

### బ్రాంచ్ కెనాల్ కోసం రూ.12 కోట్లు మంజూరు

రాజాపేట మండలంలోని 11 గొలుసు కట్టు చెరువులు, 32 కుంటలను నింపి 35,131 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని గత బీఆర్ఎస్ సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేయగా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కృషితో రూ. 12 కోట్లు విడుదల చేశారు. మండలానికి తలాపున ఉన్న గంధమల్ల ప్రాజెక్ట్ నిర్మాణ పూర్తి కాక ముందే కాళేశ్వరం ప్యాకేజీ 15లో భాగంగా 29 కిలో మీటర్ల పొడవున బ్రాచ్ కెనాల్ కాల్వ తవ్వకాల కోసం మండలంలో 157 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. సింగారంలో 40.10 ఎకరాల భూమిలో సర్వే నిర్వహించి రైతుల నుంచి భూ సేకరణ పూర్తి చేసి పరిహారం సైతం అందజేశారు. ఆరు దశాబ్దాల కరువు నేలకు సాగు జలాలు అందించాలనే గొప్ప సంకల్పంతో 5 కిలో మీటర్ల మేర కాల్వ తవ్వకాల పనులు కూడా కొనసాగాయి. ఇంకా కొద్ది మేర తవ్వితో కాల్వ పనులు పూర్తయ్యేవి. త్వరలో గోదావరి జలాలతో గొలుసు కట్టు చెరువులు జలకళ సంతరించుకొని కరువు నేల తడిసి మరో కోనసీమగా మారుతుందనే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రైతులను ఆగం చేసింది. ఏదో మార్పు వస్తుందని కలలు కన్న రైతులకు సాగు నీటితోపాటు అన్ని విధాలుగా కష్టాలు తప్పడం లేదు.

### అప్పుడే ఎండుతున్న పంటలు

రాజాపేట మండల వ్యాప్తంగా ఎలాంటి జల వనరులు లేవు. బోర్లు బావుల మీదనే ఆధార పడి వరి సాగు చేస్తారు. గతేడాది వర్షాలకు చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో భూగర్భ జలాలు పెరిగి యాసంగి 20 వేల పైగా ఎకరాలు వరి సాగు నోచుకుంది. ఈ యాసంగి చెరువులన్నీ నీళ్లు లేక వట్టి పోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోయి బోర్లు, బావు లు ఎండిపోతున్నాయి. వరి సాగు సగానికి పైగా పడిపోయింది. సిరులు పండే భూములకు సాగు జలాలు లేక పడావు పడ్డాయి. యాసంగి వరినాట్లు ఒక వైపు కొనసాగుతున్న క్రమంలో మరో వైపు వేసిన వరి చేన్లు ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయి. రెండు కార్లు రైతు భరోసా రాక, పూర్తిగా రుణమాఫీ కాక సావుకార్ల వద్ద అప్పుల చేసి సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు అరిగోస పడుతున్నారు. అన్నదాతలు అపర భగీరథుల్లా నీళ్ల కోసం జల్లెడ పడుతున్నారు. 1000 ఫీట్ల వరకు బోర్లు వేసినా దుమ్ము వస్తుందే తప్ప చుక్క నీరు బయటి రావడం లేదు. బోర్లు వేసి మళ్లీ రైతన్నలు అప్పుల పాలవుతున్నారు.

### పశువులకు మేతగా పంటలు..

రాజాపేట మండలంలో ఇప్పటికే పంటలు ఎండిపోవడంతో రైతులు పశువులకు వదిలేస్తున్నారు. పాముకుంట శివారులో రాపోలు మధుసూదన్‌రెడ్డి, గొడుగు కొండయ్య, గొడుగు కిషన్, గుంటి బీరప్ప, కాకల్ల ఎల్లయ్య, కాకల్ల సత్తయ్య, చిక్క స్వామితో పాటు మరి కొంత మంది రైతుల 50 ఎకరాల వరి పొలాలు ఎండిపోయాయి. గత్యంతరం లేక ఎండి పోయిన పంటను గొర్లు, పశువులకు మేపుతున్నారు.

### చెరువులు నింపాలని నిరసనలు

చెరువులు వట్టి పోయి భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కాంగ్రెస్ సర్కారుపై రైతన్నలు కన్నెర్ర చేస్తున్నారు. రాజాపేట మండలానికి కాళేశ్వరం 15 ప్యాకేజీ ద్వారా గొలుసు కట్టు చెరువులు నింపాలని జల సాధన కమిటీ ఏర్పాటైంది. గత పది రోజుల నుంచి నిరసన దీక్షలు చేస్తున్నారు. సొంత నిధులతో కాళేశ్వరం 15 ప్యాకేజీ కాల్వ పనులు చేపడుతామని స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇచ్చిన మాట ప్రకారం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.